క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్. సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం 10.30కు మక్కువ మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న సీఐ జి.దేముడు బాబు

సాలూరు: వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సీఐ జి.దేముడు బాబు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని లారీ యూనియన్ అసోసియేషన్‌తో పాటు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహన రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడుపరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

పార్థివ దేహానికి ఎమ్మెల్యే నివాళులు



సూర్యకాంతం పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్: ఏపీఎన్‌జీఓ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు గంట కిశోర్‌కుమార్ తల్లి సూర్యకాంతం ఆదివారం స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు అగ్రహారం వీధిలోగల వారి నివాసానికి చేరుకుని ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనో ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

చలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ

పాలకొండ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఆధ్వర్యంలో చలో విజయవాడ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. బీటీఏ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని, 11వ పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, తదితర డిమాండ్ల సాధన కోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలన్నీ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగాసనాలు వేయడం వల్ల దీర్ఘకాల ఆరోగ్య సమస్యలను అధిగమించి సంపూర్ణ ఆరోగ్యం ఆర్జించవచ్చని యోగా ట్రైనర్ కె.జనార్దనరావు అన్నారు. రుషీ యోగా కేంద్రంలో ఆదివారం ఔత్సాహికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసనాలు, సూర్య నమస్కారాల ఆవశ్యకతను తెలియజేశారు. నిర్దిష్ట ఆసనం ద్వారా శరీరంలో సంభవించే మార్పులను వివరించారు. నేటి యాంత్రిక యుగంలో శరీరానికి ఒత్తిడి నుంచి ఉపసమనం కల్పించేందుకు నిత్యం యోగా సాధన చేయడం శ్రేయస్కరమన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి మందిరంలో ఆదివారం సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు సత్తెి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో బాబాకు ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి తదితర పూజలతో పాటు విశేష అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో హోమం నిర్వహించారు. హోమంలో పాల్గొన్న దంపతులకు దీక్షా వస్త్రాలను కమిటీ సభ్యులు అందజేశారు. అలాగే దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

వీరఘట్టం: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు రాయితీలు పొందేందుకు రుణాలను సకాలంలో చెల్లించాలని సీఈఓ బూరాడ పైడిరాజు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రుణాలు పొందిన రైతులు ఫిబ్రవరి 15లోగా రుణాలు చెల్లించాలని, లేదంటే 13 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులకు 50 సెంట్లు భూమి ఉంటే రూ.1 లక్ష, 76 సెంట్లు భూమి ఉంటే రూ.2 లక్షలు, 1.50 ఎకరాలు ఉంటే రూ.4 లక్షల వరకు రుణాలు పొందవచ్చన్నారు. వివరాలకు స్థానిక కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి



మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ప్రజలకు మంచి చేయడం జగన్ అజెండా
- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట:

ప్రతి ఇంటిలో ఓ పెద్దకొడుకులా, మనవడిలా నిలుస్తూ మహిళల ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు పాచిపెంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన వేలాది మంది ప్రజలనుద్దేశించి ఏర్పాటుచేసిన సమావేశంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత వంటి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఈ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ డబ్బులతో కొందరు మహిళలు స్వయం జీవనోపాధి ఏర్పాటు చేసుకుంటున్నారని తద్వారా ఆర్థిక సముపార్జన చేసుకుంటున్నారన్నారు. కుటుంబాలు ఆర్థికంగా రాణించడం వల్ల అన్ని రంగాల్లో ముందుకు సాగడానికి అవకాశం ఉంటుందన్నారు. నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా ద్వారా మండలంలోని 841 స్వయం సహాయక సంఘాలకు చెందిన 9522 మంది సభ్యులకు రూ.3 కోట్ల 14 లక్షల ఆసరా నిధులు జమయ్యాయని మొత్తం నాలుగువిడతల్లో రూ.12 కోట్ల 56 లక్షలు జమచేశామని తెలిపారు. వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చెబుతూ ఆసరా చెక్కును మహిళలకు అందజేశారు. ప్రజలకు అన్నివిధాలా మేలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈనెల 30వ తేదీన సుమారు రూ.4 కోట్ల 30 లక్షలతో మంజూరైన పాచిపెంట బైపాస్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నామని తెలిపారు. ప్రజలకు మంచి చేయడం జగన్ అజెండా కాగా ప్రజలను మోసం చేయడం టీడీపీ అజెండా అని రాజన్నదొర పేర్కొన్నారు. ఎంపీపీ బడ్నాన ప్రమీల, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, వైస్ ఎంపీపీలు మీసాల నారాయణ, కొరిపల్లి రవీంద్ర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి డోలబాబ్జీ, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు దండి ఏడుకొండలు, తట్టికాయల గౌరీశ్వరరావు, అప్పలనాయుడు, చింత సీతయ్య, గండిపల్లిరాము, లచ్చయ్య పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఆర్థిక ఆసరా

పార్వతీపురంటౌన్/సీతానగరం: అక్కచెల్లెమ్మలకు ఆర్థికంగా చేయూతనిచ్చి వారిని లక్షాధికారులను చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆసరా సంబరాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. మహిళల ముఖాల్లో చిరునవ్వులు చూడాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమ్మఒడి, చేయూత, ఆసరా, రుణమాఫీ, ఇళ్ల పట్టాలు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనతోపాటు పలు సంక్షేమ పథకాలు మహిళ పేరిన అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

మీరే మా బలం..

గత ఎన్నికల్లో రాజన్న రాజ్యం స్థాపనకు అన్నివర్గాల ప్రజలతోపాటు ప్రధానంగా మహిళలు తమకు అండగా నిలిచారన్నారు. మళ్లీ జగనన్నను సీఎంను చేసేందుకు మీరే మా బలమని, మీరంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి చేదోడుగా నిలవాలని కోరారు.

రూ. 6.86 కోట్ల చెక్కు అందజేత

సీతానగరం మండలంలోని 1140 సంఘాల్లో గల 13204 మందికి రూ.6.86 కోట్ల చెక్కును ఎమ్మెల్యే జోగారావు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బలగ రమణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, పార్టీ సీనియర్ నాయకుడు శ్రీరాములునాయుడు, మాజీ జెడ్పీటీసీ, అంబటి కృష్ణంనాయుడు, వెలుగు ఏపీఎం ఆర్.శ్రీరాములు, మండల సమాఖ్య సభ్యులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, వీఓఏలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఉపయోగపడుతుంది



ఆసరా డబ్బులు నాలుగు విడతలు కలిపి సుమారు రూ.64 వేలు అందాయి. దీంతో ఆర్థికంగా ఎంతో ఉపయోగపడింది. ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నాం. మళ్లీ సీఎంగా జగనన్న రావాలి. మా బతుకులు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశతో ఉన్నాం.

–రావాడ సత్యవతి, కృష్ణరాయపురం, సీతానగరం మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం..



ఇంటి ఖర్చులకు సైతం ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఆసరా డబ్బులు నాలుగు విడతలు కలిపి సుమారు రూ.50 వేల వరకు వచ్చాయి. ఇటు కుటుంబ పోషణ భారం తప్పింది. అటు నాకు ఒక పని దొరికింది. మాకు ఇంతకంటే ఎంకావాలి. జగనన్నకు మేం రుణపడి ఉంటాం.

– కూర్మాన వనజ, చినభోగిలి, సీతానగరం మండలం

ప్రశాంత జీవనం



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా దక్కడంతో ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో తిరిగి రూ.51 వేలు చెల్లించినందుకు చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వం తిరిగి ఇచ్చిన డబ్బులతో వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటాం. బ్యాంకులు ఎక్కువగా రుణాలు అందిస్తున్నాయి. వాటితో వ్యాపారం సజావుగా జరుగుతోంది.

జొన్నాడ సంతోషమ్మ, చినభోగిలి, సీతానగరం మండలం

ధూపదీప నైవేద్య పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బలిజిపేట: ధూపదీప నైవేద్యాలకు (డీడీఎన్‌ఎస్) గ్రామాల్లో ఉండే ఆలయాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అటువంటి వాటికి మాత్రమే పథకం వర్తిస్తుందని జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలో మండల అర్చక సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అర్చకులు ఆలయాల వివరాలతో జిల్లా దేవదాయ శాఖ, పార్వతీపురం ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పేర్లు నమోదైన తరువాత ధూపదీప నైవేద్యాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండల కార్యవర్గ సభ్యులు మండలంలో ఉండే ఆలయాల వివరాలను సేకరించి కమిషనర్ కార్యాలయానికి అందించాలని చెప్పారు. అదేవిధంగా ఇల్లు లేని వారికి స్థలాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, కోశాధికారి ఎస్.మహేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

కలుషిత నీటిని నివారించాలి



నాచుపట్టిన రక్షిత మంచినీటి పథకం

మక్కువ: మండలంలోని నగుళ్లు గ్రామంలో కలుషిత నీటిని అరికట్టాలని గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం సీపీఎం అధ్వర్యంలో గ్రామంలో సమావేశం నిర్వహించగా పార్టీ మండలకన్వీనర్ ప్రభాకర్ మాట్లాడుతూ రక్షితమంచినీటి పథకం శుభ్రం చేయకపోవడం వల్ల, నీరు కలుషిత మవుతోందన్నారు. గ్రామంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నప్పటికీ ట్యాంకును శుభ్రం చేయడం లేదని ఆరోపించారు. సచివాలయం అధికారులకు వినతిపత్రం ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని, జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు రక్షిత తాగునీరు అందించి, ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. గ్రామంలో సంతకాలు సేకరించి, కలెక్టర్, ఎంపీడీవోలకు అందించనున్నట్లు సీపీఎం గ్రామశాఖ సభ్యులు, నాగేశ్వరరావు, రాజారావు, రాజారావు, లక్ష్మణ్, సన్యాసిరావు తెలిపారు.

సాగునీరు విడుదలకు చర్యలు



స్వామినాయుడువలస రైల్వేగేటు సమీపంలో కాలువ మరమ్మతులు చేస్తున్న రైతులు

కొమరాడ: మండలంలోని విక్రంపురం, పరుశురాంపురం, చంద్రమ్మపేట తదితర గ్రామాల్లో రైతులకు జంఝావతి రబ్బర్ డ్యాం దిగువ కాలువ నుంచి సాగునీరు విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కళింగి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కాలువల్లో చిన్న చిన్న మరమ్మతు పనులను రైతులంతా కలిసి స్వచ్ఛందంగా చేపడుతున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. గత ఖరీఫ్ సీజన్‌లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో కాలువలో పూడికతీతల కోసం ప్రభుత్వం రూ.7 లక్షలు నిధులు మంజూరు చేసిందని, ఆ నిధులతో కాలువలో కొంతమేర పూడికలు తొలగించినట్లు చెప్పారు. అయితే స్వామినాయుడువలస రైల్వే గేటు సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద కొంతమేర మరమ్మతులకు గురైందని, జంఝావతి రిజర్వాయర్ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో కాలువ మరమత్మలు పనులు చేస్తే శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



జానపద గేయాలకు అభినయిస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషిచేయాలని తమ్మినాయుడు విద్యాసంస్థల అధ్యక్షులు ఎస్.నారాయణమ్మ అన్నారు. విద్యా సంస్థల్లో ఆదివారం ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమ్మ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఆశాజ్యోతి’ సేవలు అమోఘం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల కొత్తవలస ప్రాంతంలో నెలకొల్పిన ఆశాజ్యోతి ఆశ్రమ సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆశాజ్యోతి ఆశ్రమ వార్షిక సమావేశంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆశ్రమంలో అనాథ పిల్లలకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులతో కలిసి పాల్గొని పిల్లలకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని చిన్న పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి ఆశ్రమానికి విరాళాలు అందించిన దాతలను ఒక్కొక్కరిగా ఎమ్మెల్యే సమక్షంలో సభ్యులందరు కలిసి ఘనంగా సత్కరించి గౌరవించారు. కార్యక్రమానికి ముందుగా తమ ఆశ్రమంలో ఉండి చదువుకుంటున్న విద్యార్థి బిడ్డిక జీవన్ కుమార్ ఇస్రో సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో జరిగిన క్విజ్ పోటీలో ద్వితీయ స్థానం సాధించిన సందర్భంగా ఘనంగా సత్కరించి సన్మానించి ఆ విద్యార్థిని ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే రూ.5000 ఆర్థిక ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు దశాబ్దాల కాలంగా అనేకమంది విద్యార్థులకు, సమాజానికి సేవ చేస్తున్న ఆశాజ్యోతి ఆశ్రమం సేవలు విలువ కట్టలేనివని ఈ ఆశ్రమం ద్వారా ఎంతోమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ అమూల్యమైన సహాయాన్ని అందిచడం అభినందనీయమన్నారు. ఈ సేవా సంస్థ ముందుముందు కూడా మరెన్నో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించడంతోపాటు భవిష్యత్‌లో గొప్పస్థాయికి చేరుకుని సేవలను మరింత విస్తృతం చేసేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఆశ్రమం సభ్యుల కోరిక మేరకు తప్పక రోడ్డు మార్గం వేసేందుకు కృషి చేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యవర్గ ప్రెసిడెంట్ జగదీష్, సెక్రెటరీ జల్దు వినయ్, ట్రస్టు సభ్యులు, పలువురు ప్రముఖులు, పెద్దలు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, విద్యార్థులు, ట్రస్టు దాతలు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంకు మహర్దశ



వీరఘట్టం పట్టణం

- పెరుగుతున్న పట్టణ జనాభా, విస్తీర్ణం
- నగరపంచాయతీగా మారేందుకు అవకాశం

వీరఘట్టం: కొత్త జిల్లాల ఏర్పాటుతో వీరఘట్టం మేజరు పంచాయతీకి మహర్దశ వచ్చింది. ఇదివరకు శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ఈ పంచాయతీ నేడు పార్వతీపురం మన్యం జిల్లాలో చేరడంతో మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం లభించినట్లయింది. డివిజన్ కేంద్రం పాలకొండకు, జిల్లా కేంద్రం పార్వతీపురానికి మధ్యలో ఉండడంతో రోజురోజుకు పట్టణ విస్తీర్ణం పెరుగుతోంది. అలాగే వీరఘట్టం-వంగర మండలాలను అనుసంధానం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కిమ్మి-రుషింగి వంతెన అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతం వ్యాపార, వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతోంది. వీరఘట్టం పట్టణాన్ని నగర పంచాయతీగా మారిస్తే ఇక్కడ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఇటీవల ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చారు. ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపితే వీరఘట్టంకు మహర్దశ పడుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

బ్రిటిష్ కాలంలో 4 వేల జనాభాతో 1918లో వీరఘట్టం గ్రామం పంచాయతీగా ఆవిర్భవించింది. అనంతరం జనాభా పెరగడంతో 1971లో మేజరు పంచాయతీగా మార్పు చేశారు. కాలక్రమేణ జనాభా పెరగింది. శివారు గ్రామాలను తనలో కలుపుకుంటూ మేజరు పంచాయతీ పట్టణంగా మార్పు చెందింది. ప్రస్తుతం సుమారు 20 వేలకు పైగా జనాభా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

నగర పంచాయతీగా మారాలంటే..

వీరఘట్టం మేజరు పంచాయతీ నగర పంచాయతీగా మారాలంటే నిబంధనల ప్రకారం 25 వేల నుంచి 30 వేల జనాభా ఉండాలి. పట్టణ శివారులో 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న నడుకూరు, బూరుగ, విక్రమపురం, యు.వెంకమ్మపేట గ్రామాలు మేజరు పంచాయతీలో విలీనం అయితే నగర పంచాయతీగా మారేందుకు మార్గం సుగుమం అవుతుంది.

అవకాశం ఉంది



వీరఘట్టం మేజరు పంచాయతీలో ప్రస్తుతం 20 వేలకు పైగా జనాభా ఉంది. సమీపంలో ఉన్న గ్రామాలు మేజరుపంచాయతీలో విలీనం అయితే భవిష్యత్‌లో వీరఘట్టం నగర పంచాయతీగా మార్పు చెందే అవకాశం ఉంది. అలా అయితే ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

– వి.రామచంద్రరావు, ఈఓ, వీరఘట్టం మేజరుపంచాయతీ

అభివృద్ధిపైనే దృష్టి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వీరఘట్టం పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాం. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేసి అభివృద్ధిని అడ్డుకున్నాయి. మాకు ఓట్లు ముఖ్యం కాదు. గ్రామాభివృద్ధే ముఖ్యం. అందుకే రూ.5.50 కోట్లుతో పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాం. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే

షర్మిలకు రాష్ట్రాభివృద్ధి కనిపించలేదా..

- వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా కార్యదర్శి సుహాసిని

వీరఘట్టం: ప్రగతి పథంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్‌ను చూసి దేశం మొత్తం గర్వపడుతుంటే.. తెలంగాణ నుంచి వచ్చిన షర్మిలకు ఇక్కడ అభివృద్ధి కనిపించకపోవడం శోచనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా కార్యదర్శి నల్ల బిల్లి సుహాసిని అన్నారు. వీరఘట్టంలో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. జగనన్న వదిలిన బాణం అని నాడు మమ్మల్నిందరినీ నమ్మించావు, మీ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసిన కాంగ్రెస్‌తో నేడు చేతులు కలిపి సొంత అన్న అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నావు.. ఇది నీకు తగునా అని షర్మిలను ప్రశ్నించారు. సొంత అన్నను నీవు కాదన్నా.. రాష్ట్రంలో ఉన్న కోట్లాది మంది అక్కచెల్లెమ్మలు జగనన్నకు అండగా ఉంటామన్నారు. ప్రజల ఆశీస్సులే శ్రీరామరక్షగా చేసుకుని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా మహిళా కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయడుకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.